ప్రజాశక్తి
మంగళవారం 23 జులై, 2024
5
శ్రీకాకుళం

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

శ్రీకాకుళం అర్బన్ : లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. బాలసదన్, శిశు గృహలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. నగరంలోని శిశుగృహ, బాలసదనాన్ని సోమవారం సందర్శించారు. లింగ నిర్ధారణ చేసినా, పరీక్షలు చేయించుకుని నివేదికలు అడిగినా నేరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఇప్పుడు కాక ఇంకెప్పుడు?

- ప్రాజెక్టులు, కేంద్ర సంస్థలు తీసుకురావడానికి ఇదే మంచి తరుణం
- ఎన్‌డిఎలో భాగస్వామిగా టిడిపి
- కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా రామ్మోహన్‌నాయుడు
- నేడు లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం

సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్రంలోని ఎన్‌డిఎ కొత్త ప్రభుత్వం లోక్‌సభలో మంగళవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికల ముందు ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వమే మళ్లీ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈసారి ప్రవేశపెడుతున్న బడ్జెట్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఎన్నికల ముందు బడ్జెట్ ప్రవేశపెట్టే సమయానికి ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా లేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా చేరడం, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కడంతో అంతా సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాకు కొత్త ప్రాజెక్టులు, పథకాలు తీసుకురావడానికి ఇంతకన్నా మంచి తరుణమేముంటుందని సిక్కోలువాసులు చర్చించుకుంటున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రవేశపెడుతున్న బడ్జెట్‌ల్లో జిల్లాకు ఏ మాత్రం ప్రాధాన్యం దక్కలేదు. 2014లో తొలిసారి అధికారం దక్కించుకున్న ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా చేరింది. ఆ సమయంలో జిల్లాకు ఏరకమైన ప్రయోజనం ఒనగూరలేదు. కేంద్ర ప్రభుత్వం ఆ కాలంలో ఉన్నత సంస్థలను రాష్ట్రానికి కేటాయించినా జిల్లాకు ఒక్క సంస్థ కూడా రాలేదు. కొత్త ప్రాజెక్టులు, పథకాలూ కేటాయించలేదు. చివరకు వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలకు, రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున మూడేళ్లు ఇచ్చిన కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 2018 నుంచి ఆపేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి అనేక బిల్లుల విషయంలో మద్దతు పలికినా ఐదేళ్లలో బిజెపి ప్రభుత్వం అటు రాష్ట్రానికి, ఇటు జిల్లాకు బడ్జెట్ కేటాయింపులు, ప్రాజెక్టుల విషయంలో రిక్తహస్తమే చూపింది.

రైలు కూత వినిపించేనా?

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లో సుమారు 22కు పైగా ఎక్స్‌ప్రెస్‌లు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. ప్రతి వారం ఐదారు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్నా, హాల్టింగ్ లేదు. కాశీకి నేరుగా ప్రత్యేక రైలు కావాలన్నది జిల్లా ప్రజలు చాలాకాలం నుంచి కోరుతున్నా, అదీ కలగానే మిగిలింది. జిల్లాలోని జి.సిగడాం నుంచి రాజాం మీదుగా విజయనగరం జిల్లా బొబ్బిలిని కలుపుతూ గతంలో రూ.60 లక్షలతో సర్వే చేశారు. ఇప్పటివరకు దానికి అతీగతి లేదు. గుణుపూర్ నుంచి నౌపడ వరకూ రైలు మార్గాన్ని బ్రాడ్‌గేజ్‌గా మార్చి పదేళ్లు గడుస్తున్నా, నేటికీ విద్యుద్దీకరణ పనులకు నోచుకోలేదు. విశాఖ-హడ్డుబంగి ప్రాంతానికి కొత్త రైలు మార్గం వేయనున్నట్లు ప్రకటించినా, దానిలోనూ కదలిక లేదు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తామని 2012-13 రైల్వే బడ్జెట్‌లో ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. మోడల్ స్టేషన్ మాట పక్కన పెడితే, ఈ స్టేషన్ మీదుగా వెళ్తున్న యశ్వంత్‌పూర్-హౌరా, పూరీ-అహ్మదాబాద్ రైళ్లు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. రైళ్లకు హాల్ట్‌లు, జిల్లా మీదుగా వెళ్లే కొత్త రైళ్లపై జనం ఆశలు పెట్టుకున్నారు.

వరాల ప్రకటనపై అన్నదాతల ఆశలు

వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే సబ్సిడీలపై అటు రైతాంగం కూడా ఎదురుచూస్తోంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఐదెకరాల వరకు రైతులకు రూ.ఆరు వేలను కొనసాగిస్తామని ఇప్పటికే మేనిఫెస్టోలో పేర్కొనడంతో ఆ సాయం అందనుంది. పంటలకు మద్దతు ధర ఏటా పెంచుతామని హామీనిచ్చింది. పంటల బీమా పథకాన్ని బలోపేతం చేస్తామని హామీనివ్వడంతో ఏ రకమైన భరోసా దక్కనుందోనని అన్నదాతలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'ఉపాధి'కి ఊతమిచ్చేనా?

వ్యవసాయ పనులు లేని సీజన్‌లో వ్యవసాయ కార్మికులు, కూలీలకు కాస్తాకూస్తో పనులు కల్పించి ఊతమిస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ) నిధుల కేటాయింపులు ఏమేరకు ఉంటాయన్న చర్చ నడుస్తోంది. గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా నిధులు పెంచింది. ఈసారి బడ్జెట్‌లో నిధులు పెంచాలని అంతా కోరుతున్నారు. బడ్జెట్ పెంపుతో అటు కూలీలకు పనులు, ఇటు మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో మౌలిక సౌకర్యాల కల్పన సాధ్యపడుతుందని అధికారులు చెప్తున్నారు.

కేంద్ర ప్రయోజిత పథకాలకు ప్రాధాన్యం దక్కేనా?

కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలకు (సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీంలు) అధికంగా నిధులు తీసుకురావడంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రధాన దృష్టిసారించింది. రాష్ట్ర ఎంపీలకు ఆ విధంగా దిశా నిర్దేశం చేసింది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన ద్వారా నీటిపారుదల శాఖ లోని కొన్నిరకాల పనులు చేసుకునే అవకాశం లభిస్తుంది. జల జీవన్ మిషన్ ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామానికి రక్షిత మంచినీటిని అందించవచ్చు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా రహదారులు, పేదలకు ఇళ్ళు నిర్మించుకునే అవకాశం ఉంది. వీటితోపాటు అనేక పథకాలు ఉన్నాయి. వీటికి నిధుల కేటాయింపు ఎలా ఉంటుంది?, జిల్లాకు ఎంతమేర వాటా దక్కుతుందనేది చూడాల్సి ఉంది.

వేతన జీవులకు ఊరట లభించేనా?

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తమకు ఆదాయ పన్ను పరిమితి పెంపుపై ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో పన్నుల విధానాల్లో మార్పు జోలికి వెళ్లలేదు. ఇప్పటివరకు అమల్లో ఉన్న ఆదాయపు పన్ను పరిమితి రూ.ఏడు లక్షలను యదావిధిగా కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఎనిమిది లక్షలకు పెంచాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

'పైడిగాం' ఆధునీకరణ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - సోంపేట

రాష్ట్ర ప్రభుత్వం పైడిగాం ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.17 కోట్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పైడిగాం ప్రాజెక్టును సిపిఎం ప్రతినిధి బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైడిగాం ప్రాజెక్టు ఆయకట్టు సుమారు ఐదు వేల ఎకరాలని, ఈ ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేస్తే మరో ఏడు వేల ఎకరాలకు నీరు అందించ వచ్చని తెలిపారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు గత పదేళ్లలో నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు.

పైడిగాం ప్రాజెక్టు చివరి గ్రామాలైన పలాసపురం, లక్కవరం, బూరగాం, జింకిభద్ర, బెంకిలి తదితర గ్రామాలకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరందకపోవడంతో నాట్లు వేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. మహేంద్రతనయ నుంచి వచ్చే నీటిలో ఒడిశా ప్రభుత్వంతో ఒప్పందం మేరకు 185 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉన్నా, 40 క్యూసెక్కుల నీటినీ ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందని విమర్శిం చారు. ప్రాజెక్టు ఆధునీకరణ చేయకపోవడంతో నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతుందని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యమే రైతులకు శాపంగా మారిందని విమర్శించారు. పైడిగాం ప్రాజెక్టు పరిధిలో మూడు మండలాల్లో 70 చెరువులకు నీరు ఇవ్వాల్సి ఉన్నా, కాలువలు ఆధునీకరించకపోవడంతో నీరందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పైడిగాం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ఆధునీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ, నాయకులు జయరాం, రామచంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వు కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయాన్ని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు విభాగాల పనితీరు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎఆర్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, ఆయుధాగారం, మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగం, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ గదులు, గ్యాస్ గోడౌన్స్, జిమ్ తదితర విభాగాలను పరిశీలించి, విభాగాల రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఆయుధాలు, వాహనాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పోలీస్ జాగిలాల ఆరోగ్యంపై శ్రద్ధ చూపించి వాటి రక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐలు సురేష్, నర్సింగరావు, ఇతర అధికారులు ఉన్నారు.

రాష్ట్రంలో 'రెడ్ బుక్' రాక్షస పాలన

- కేసులు పెట్టినా భయపడేది లేదు
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

మాట్లాడుతున్న మాజీ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాక్షస పాలన సాగిస్తున్నారని మాజీ స్పీకర్, వైసిపి సీనియర్ నాయకులు తమ్మినేని సీతారాం ఆరోపించారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 35 హత్యలు, 300 హత్యాయత్నాలు, 20 హత్యాచారాలు, 1050 దాడులు, దౌర్జన్యాలు, 490 ప్రభుత్వ, 560 ప్రైవేటు ఆస్తుల విధ్వంసం వంటి ఘటనలతో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన 45 రోజుల్లోనే పాలన ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో అన్న భయాందోళనల్లో ప్రజలు ఉన్నారని చెప్పారు. ప్రజారంజక పాలన అందించాలని ప్రజలు అధికారం అప్పగిస్తే, వీరేం చేస్తున్నారో ప్రజలు చూస్తున్నారని తెలిపారు. శాంతిభద్రతలపై చర్యలు తీసుకోలేని హోంశాఖ మంత్రి తిరిగి దబాయించడం విడ్డూరంగా ఉందన్నారు. 45 రోజుల్లో రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు పెట్టిన ఈ ప్రభుత్వం, పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే స్థితిలో లేకపోవడం దారుణమన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్ ప్రభుత్వం చెప్పిన కథని అసెంబ్లీలో చదివి వినిపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసిపి ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకొని, చేతిలో ఉన్న ప్రతులను చించివేయడం ప్రభుత్వ దౌర్జన్యాలకు పరాకాష్టగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం తనతో పాటు వైసిపి నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నో బూటకపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారని, ప్రస్తుతం ఏ పథకం అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని వారికి మేలు చేయాలన్నారు. లేకుంటే ప్రజలతో కలిసి వైసిపి పోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. సమావేశంలో వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, దుంపల శ్యామ్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'యుబి' కార్మికులకు ఉపాధి కల్పించాలి

'మీకోసం'లో 151 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని రణస్థలం మండలం యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమలో అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్‌లోని మీకోసంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఎం.నవీన్‌లను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి కార్మికులుగా క్రమశిక్షణతో పనిచేస్తున్న జె.గంగరాజు, పి.సత్యనారాయణ, జి.శంకర్, ఎండ తవుడు, కె.గొల్లబాబులను ఈ నెల 15 నుంచి యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా అక్రమంగా నిలుపుదల చేసిందన్నారు. యాజమాన్యం అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీసుకు పాల్పడుతుందన్నారు. కార్మికులకు ఇదే వారి జీవనాధారమని, అందువల్ల యాజమాన్యం పనిలోకి తీసుకునేలా జిల్లా యాజమాన్యం ఆదేశాలు ఇవ్వాలని విన్నవించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యంపై తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తూ కన్నీరు పెడుతున్న మహిళ

జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో రీసర్వే సమయంలో పాసుపుస్తకాలు జారీ చేసిన భూములు ఇప్పుడు వెబ్‌సైట్‌లో అడంగళ్లు కనిపించడం లేదని, దానిని సరి చేయాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌ను కోరారు. బూర్జ మండలం నారాయణపురానికి చెందిన మీసాల జోగినాయుడు తన తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి మొత్తాన్ని తన సోదరుని పేరుపై అడంగల్ నమోదై ఉందని, ఆ భూమిని తన సోదరుడు, చెల్లెలతో పాటు తనకూ వాటాగా విభజించుకుని రీసర్వేలో నమోదు చేసుకున్నా అడంగల్‌లో మారలేదని వివరించారు. అలాగే నందిగాం మండలం పెద్దినాయుడుపేటకు చెందిన వరలక్ష్మి తన భూమికి సంబంధించిన హక్కు పత్రాలు తన వద్దే ఉన్నాయని, కానీ, అడంగల్‌లో ఆ భూమి కనిపించడం లేదని వివరించారు. రణస్థలం మండలం కొత్తపాలెంకు చెందిన రైతులు కొసంగి నాగరాజు, భీమారావులు తన భూములను ఎ1లో చేర్చారని, వాటిని విడుదల చేసి తమ పేరుతో అడంగల్ జారీ చేయాలని కోరారు. ఇలా 27 మంది రైతులు తమ ఫిర్యాదులను అందజేశారు. నందిగాం మండలం కొత్తఅగ్రహారంలోని ప్రభుత్వ పాఠశాలలో 23 ఏళ్లుగా పనిచేస్తున్న వంట కార్మికులను రాజకీయ కారణాలతో ఎంఇఒ తొలగించారని,వారిని తిరిగి తీసుకోవాలని మధ్యాహ్నభోజనం పథకం కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, వంట కార్మికులు టి.ప్రవీణ, మడ్డు సావిత్రిలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందిన రామంజిని తనకు ఇల్లు లేక పిల్లలతో ఇబ్బంది పడుతున్నానని, ఇతరుల స్థలంలో గుడారాలు వేసుకొని జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిలకపాలెంలో ఇంటి స్థలం ఇప్పించాలని కోరారు. అలాగే అల్లినగరానికి చెందిన ఎం.శ్రీనివాసరావు గ్రామంలో కోదండరామాలయం పక్కన ఉన్న కోనేరు సైడ్‌వాల్ పూర్తిగా పడిపోయిందని, రహదారి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సైడ్‌వాల్ మంజూరు చేయాలని కోరారు. పోలాకి మండలం ఈదులవలసకు చెందిన ఇప్పిలి సుబ్బయ్య ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాన్ని తనకు ఇవ్వాలని కోరారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా 151 వినతులను అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ గణపతిరావు, కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన దొర, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, నీటిపారులదల శాఖ ఎస్ఇ సుధాకర్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వరదనీటిపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఒడిశాలో భారీగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి నాగావళి, వంశధార నదులకు వచ్చి చేరుతున్న వరద నీటిపై ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పలు శాఖల అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. భారీగా కురుస్తున్న వర్షాలతో నదీ ప్రవాహం ప్రమాద స్థాయిని దాటితే గొట్టా వద్ద గేట్లను ఎత్తడానికి తగిన ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రధాన నదుల వరద నీటిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన నివేదిక అందజేయాలని ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలపై మాట్లాడుతూ ఎల్.ఎన్ పేట, తురకలకోట వద్ద కాజ్ వే దెబ్బతిన్న కారణంగా వంశధార నీరు 150 ఎకరాల్లో పంటను ముంచెత్తిందని.. దీనిపై స్థానిక తహశీల్దార్‌తో కలిసి వ్యవసాయ, వంశధార శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్‌కు సూచించారు. జిల్లావ్యాప్తంగా చేపడుతున్న పారిశుధ్య నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావును.. సీజనల్ వ్యాధులు, జ్వరాలపై డిఎంహెచ్ఒ మీనాక్షిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన, జిల్లా అటవీ శాఖల అధికారులతో తాజా పరిస్థితిని గురించి అడిగారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నీటిపారుదల శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకరరావు, పశు సంవర్ధకశాఖ జెడి జయరాజ్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, ఉద్యానవనశాఖ అధికారి అర్.వి.వి ప్రసాద్, ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను కోరారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో 'మీకోసం'లో సోమవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఆప్కాస్ పరిధిలో చేరుస్తామని హామీనిచ్చినా అమలు చేయలేదని చెప్పారు. ప్రయివేట్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. లేకుంటే మున్సిపల్ కార్మికులకు అమలు చేస్తున్న వేతనాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సుమారుగా 600 మంది కార్మికులు పలు విభాగాల్లో 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంలో కాంట్రాక్టర్లు వైఫల్యం చెందారన్నారు. గతంలో జరిగిన వేతన ఒప్పందం అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంట్రాకర్ దృష్టికి తమ సమస్యలను ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కాంట్రక్టరు వేతనాలు చెల్లించడం లేదన్నారు. శానిటేషన్ కార్మికులకు నెలకు రూ.12650, సెక్యూరిటీలకు రూ.9,598 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఎస్‌టిపి ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులను క్రమబద్ధీకరించి, సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రిమ్స్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు కె.రవి, ఎ.సావిత్రి, జి.కృష్ణవేణి, టి.కుమారి, ఐ.లక్ష్మి తదితరులున్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జైలులో ఖైదీలుగా ఉన్న వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుందని ఆ సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా జడ్జి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా జైలును సందర్శించారు. అక్కడున్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అందుతున్న ఆహారం, నాణ్యతను పరిశీలించారు. ఖైదీలందరితో మాట్లాడి ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా కేసుల పరిష్కారానికి ఉచితంగా సేవలు అందించనున్నట్లు తెలిపారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకుంటే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌కు అందజేసి ఈ సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు అన్ని సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఆధార్ శిబిరాల నిర్వహణపై సోమవారం మాట్లాడారు. 0-5 ఏళ్ల లోపు పిల్లలకు బాల ఆధార్, 5 నుంచి ఏడేళ్లు, 15 నుంచి 17 సంవత్సరాలు గల వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. గత పదేళ్లలో ఆధార్ కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీలో ఎటువంటి మార్పులు చేసుకోని వారు తమ ఒరిజినల్ గుర్తింపు ధ్రువపత్రాలతో ఈ శిబిరాల్లో అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలసత్వం లేకుండా చట్ట ప్రకారం తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి ప్రజల నుంచి 55 ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత అధికారులకు తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. సమస్యలపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో ఎస్‌పి కార్యాలయానికి నిర్ణీత గడువులోగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జి.ప్రేమ కాజల్, వి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న జెసి నవీన్

వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వికలాంగుల సమస్యలు తీర్చడానికి అవసరమైన సమగ్ర సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. సోమవారం జెడ్‌పిలో కళాశాలలో డిగ్రీ, పి.జి చదువుతున్న వికలాంగులకు ఎనిమిది ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్‌లు, ఒక ట్రై సైకిల్‌ను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చదువుతున్న కళాశాలల్లో తరగతుల నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోగలరని సూచించారు. ఐటిఐ నుంచి పి.జి వరకు చదువుకున్న, చదువుతున్న వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు కావాలంటే వికలాంగుల సంక్షేమశాఖ, శ్రీకాకుళం కార్యాలయానికి, ఆన్‌లైన్‌లో లేక నేరుగాగాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎంపిపి పుష్ప

రైతులను ఆదుకోవాలని వినతి

ఇచ్ఛాపురం : టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటుతున్నా రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని ఎంపిపి బోర పుష్ప అన్నారు. మండల ఎఒ టి.భార్గవిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం, మున్సిపాలిటీలో సుమారు ఆరు వేల మంది రైతులు ఉన్నారని, వారికి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ లబ్ధిని ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యరకమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, వార్డు మెంబర్ బచ్చు జగన్, మాజీ ఎంపిపి కారంగి మోహనరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు దక్కత నూకయ్యారెడ్డి, సర్పంచ్ కారింగి త్రినాథరెడ్డి, సల్ల దేవరాజు పాల్గొన్నారు.

జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా జట్టు ఎంపిక సోమవారం నిర్వహించామని చదరంగం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు. పురుషుల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎం.శేషాద్రిపట్నాయక్, ద్వితీయ స్థానంలో నిలిచిన బి.నితిన్‌కుమార్‌లతో పాటు మహిళల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన లక్కోజు దీత్య, ద్వితీయ స్థానంలో నిలిచిన గౌతమిలను ఎంపిక చేశారని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకైన జట్టుకు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు బగాది కిషోర్, సభ్యులు బొమ్మన మధు, ఎస్.భైరాగ్, బగ్గు అభినవ్, అటవీశాఖ అధికారి రాంబాబులు అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

సతీష్‌బాబుపై ఫిర్యాదుల వెల్లువ

కవిటి: మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శి మన్నం సతీష్‌బాబు సాగిస్తున్న ఆర్థిక మోసాలపై సోమవారం ఫిర్యాదు చేశారు. జెడ్‌పిలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారాల వేదికలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పిని కలిసి కూడా వినతిపత్రం అందజేశారు. సతీష్‌బాబు 15 ఏళ్లుగా అతను సాగిస్తున్న దందా కోట్లలో కొనసాగుతోందని, శ్రీకాకుళానికి చెందిన తమ్మినేని సాయి లీలాకృష్ణ, పి.నరేష్‌కుమార్, జయలక్ష్మి, ఎం.అనిల్, ప్రేమ్‌కుమార్ రాజు, ఎం.ఈశ్వరి, టెక్కలికి చెందిన నీలయ్య, దువ్వాడ భాగ్యరాజు, రణస్థలానికి చెందిన ఎం.కిరణ్‌లు ఫిర్యాదు చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తమ వద్ద రూ.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని భోరుమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ డబ్బులు తమకు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే కృషితో వంశధార నీరు

వజ్రపుకొత్తూరు: ప్రతి చేనుకూ నీరు, ప్రతి చేతికీ పనినినాదంతో ఎన్నికలకు వెళ్లి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచిన గౌతు శిరీష బాధ్యతలు చేపట్టిన 20 రోజుల్లోనే వంశధార నీరు అందించేందుకు భగీరథ ప్రయత్నం చేశారని టిడిపి జిల్లా నాయకుడు సార నోములరావు అన్నారు. మండలంలోని చినవంకలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా రైతులు వంశధార నీటిని చూడలేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లు రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సాగునీటి వనరుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇచ్చి రైతాంగం మన్ననలు పొందారన్నారు.

నెలవారీ సమీక్షలు చేపట్టాలి

మందస: విఒఎలు నెలవారీ సమీక్షలు చేపట్టాలని ఎపిఎం జి.ప్రసాదరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఒఎలందరూ వార్షిక గ్రామ సంఘం మహాజన సభలు ప్రతినెలా పూర్తి చేయాలన్నారు. పది మంది చొప్పున పేర్లు ఐడెంటిపై చేయాలన్నారు. సిసిలు శ్రీనివాస్, ఎంఎస్ అధ్యక్షులు కాంతమ్మ, కోశాధికారి విజయశ్రీ, అకౌంటెంట్ కళ్యాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

పాతపట్నం: మండలంలోని రొంపివలస జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమస్థానంలో అగతముడి మోహిత్‌కుమార్, ద్వితీయ స్థానంలో కిక్కర జగదీశ్వరరావు నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయులు నల్ల కుమారస్వామి అధ్యక్షతన పాతపట్నానికి చెందిన రామరాజ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు పారశెల్లి రామరాజు సోమవారం నగదు పురస్కారాలను సర్పంచ్ ఎం.అప్పలనాయుడు అందజేశారు. ఉపాధ్యాయులు ఆర్.కృష్ణవేణి, బి.వి.రమణ, పొల్లాయి, జి.గోవిందరావు, ప్రభావతి, కె.ఢిల్లేశ్వరి, మంజుశ్రీ పాల్గొన్నారు.

ముంపు పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి శంకర్ భరోసా ఇచ్చారు. సోమవారం నియోజక వర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో ముంపునకు గురైన పంట పొలాలను ఆమె అధికారులతో కలిసి సందర్శించారు. గడచిన నాలుగు రోజులగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాల కారణంగా పంట పొలాలు ముంపునకు గురి కావడంతో సాగు చేసుకున్న పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రధానంగా వరి, మిరప సాగుచేస్తున్న రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సమక్షంలో రైతులతో ఆమె మాట్లాడారు. గార మండలం అంపోలు, శ్రీకాకుళం మండలం కిష్టప్పపేట గ్రామాల మధ్య ముంపునకు గురైన పంట పొలాల్లో రైతులు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నీట మునిగిందని, అయితే ఏ ఒక్క రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అన్నివిధాలా రైతాంగానికి అండగా ఉంటుందని, శాస్త్రవేత్తల సూచనలు పాటించి నష్టాన్ని నివారించుకోవాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు వ్యవసాయశాఖ ఎడి, గార వ్యవసాయాధికారి, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, రాగోలు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని ఇసకలపాలెం, కొండవలసలో ముంపు పంట పొలాలను ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సిహెచ్ బాలకృష్ణ, ఎస్.కిరణ్ కుమార్‌లు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముంపు భారిన పడిన పంటను ఎలా సంరక్షించుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు.

శ్రీకాకుళం అర్బన్ : పొలాలను పరిశీలిస్తున్న స్వాతి, శాస్త్రవేత్తలు, అధికారులు

కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పోలాకి: ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట ముంపునకు గురైందని, వాటికి నష్టం వాటిల్లకుండా ఉండాలంటే యాజమాన్యం పద్ధతులు పాటించాలని రాగోలు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త పి.ఉదయబాబు అన్నారు. మండలంలోని పల్లిపేట, డోల ప్రాంతంలో నీటి మునిగిన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయ సంచాలకులు రవీంద్రభారతి, వ్యవసాయ అధికారి పి.చిరంజీవి, ఎడిఎ వెంకటేశరరావు, వివిఎ గనేష్, పవిత్ర, విఆర్ఒ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎంజిఆర్

లోకేష్‌ను కలిసిన ఎంజిఆర్

పాతపట్నం: పాతపట్నంలో ప్రభుత్వ ఐటిఐని మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవితో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించారు.

పరామర్శిస్తున్న కృష్ణదాస్ తదితరులు

పలు కుటుంబాలు పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

మండలం పోలాకి పంచాయతీలో సోమవారం ఇటీవల మృతి చెందిన గొర్ల రమణమ్మ, తాడేల సత్యం కుటుంబాలను వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ బైరాగి నాయుడు, రెంటికోట త్రినాధరావు, ఎంపిటిసి అశోకబాబు, స్థానిక నాయకులు పరామర్శించారు.

పశువులకు టీకాలు

జి.సిగడాం: వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వ్యాపించే ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు వేయించాలని జి.సిగడాం పశువైద్యాధికారి సుమన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జి.సిగడాం, టి.డి.వలస, గొబ్బూరులో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సుమన్ వ్యాధి వ్యాప్తికి గల కారణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి వలన కలిగే నష్టాలు, వ్యాధిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ఎల్ఎస్ఎ యు.సూర్యనారాయణ, విఎ పి.ప్రసాద్, ఎహెచ్ఎ బి.శంకరరావు, ఎల్.రంగారావు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని మండలం కొండములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ అన్నారు. సోమవారం రావాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జనార్ధననాయుడు ఆధ్వర్యంలో 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు హెల్త్ స్క్రీన్‌టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన నాయుడు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది డి.రేవతి, ఎమ్.రమేష్, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎమ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ

టెక్కలి : రోడ్డుపై ద్విచక్రవాహనం నడిపే వాహనదారులు హెల్మెట్ వినియోగం తప్పనిసరిగ్గా ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్ చక్రవర్తి తేజ మల్లా అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని ఆదిఆంధ్రావీధి, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రజలతో మాట్లాడి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, ప్యానల్ న్యాయవాదులు ఎం.గోవింద్, పి.మధుబాబు, పొట్నూరు ఆనందరావు, ఐ.మల్లేష్, సిఐ పైడయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

క్షతగాత్రునికి ఆర్థికసాయం

కవిటి: మండలంలోని శిలగాంకు చెందిన క్షతగాత్రుడు కాళ్ల తాతయ్యకు వైసిపి నాయకుడు ఎస్.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందించారు. నిర్మాణ పనుల్లో తాతయ్య కాళ్లపై టైల్స్ పడడంతో తీవ్ర గాలయ్యాయి. దీంతో తాతయ్యని విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రెక్కాడితే గానీ డొక్కాడని తాతయ్య కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తక్షణసాయంగా అతని కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, కౌన్సిలర్ బచ్చు జగన్ రెడ్డి, ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి సల్ల దేవరాజు పాల్గొన్నారు.

ఆర్థికంగా సంఘాల అభివృద్ధి

లావేరు: డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి సంఘం నుంచి గ్రామ సంఘానికి రూ.200 పొదుపు చేయాలని వెలుగు క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్ అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో విఒఎలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉమెన్ లిడ్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా ముద్ర, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ, విశ్వకర్మ తదితర పథకాల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అన్ని సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ ఉదయకుమార్, ఎపిఎం ఎం.మాధవీలత, సిసిలు, విఒలు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళి

ప్రజాశక్తి- నరసన్నపేట

భారతదేశ సరిహద్దులలో జవాన్లుగా ఉన్న జిల్లాకు చెందిన డొక్కరి రాజేష్, సనపల జగదీశ్వరరావులు ఉగ్రవాదుల దాడిలో మృతి చెందడం బాధాకరమని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులు అన్నారు. నరసన్నపేటలోని సాయి రత్న ఐటిఐ కళాశాల వద్ద వారి చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు డొక్కరి రాజేష్, నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన సనపల జగదీశ్వరరావు కుటుంబాలకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వంశీ, జగన్నాథం, భవానీశంకర్, జగదీష్, రాము, సాంబశివరాజు పాల్గొన్నారు.

టెక్కలి : భారతదేశ సంరక్షణలో అమరులైన రాజేష్,

టెక్కలి : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

జగదీశ్వరరావు వీరసైనికులకు జోహార్లు అర్పించారు. ఇందులో భాగంగా సోమవారం టెక్కలి ప్రజా చైతన్య కళా సమితి ఆధ్వర్యాన పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద ప్రారంభమై ర్యాలీ అంబేద్కర్ కూడలి, కచేరీ వీధి, ఇందిరాగాంధీ కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో వ్యవస్థాపకులు చిలుకు కృష్ణారావు, అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరకవాటం గణపతిరావు, మూల తాతయ్య, దూసి ఆంధ్రాస్టాలిన్, బోడ్డ అయ్యబాబు, రేజేటి రమణమూర్తి, కుప్పిలి కామేశ్వరరావు, తమ్మినేని వైకుంఠరావు, బాడాన నారాయణరావు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాలను పూర్తి చేయాలి

మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తి చేసేందుకు మండల సమైఖ్యలు అంకితభావంతో పని చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు చెల్లించని సంఘాలను గుర్తించాలని, స్త్రీనిధి ద్వారా అనుకున్న మేర రుణాలు అందించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, మహిళా స్వయం శక్తి సంఘాలకు వారు దాచుకున్న పొదుపు డబ్బుల నుంచి సభ్యురాలి అవసరం మేరకు అప్పులు ఇచ్చుకోవడానికి ఇంటర్నల్ లాండింగ్‌ను బ్యాంకు మేనేజర్లు ప్రోత్సహించాలన్నారు. ఆమదాలవలస డిసిసిబి బ్యాంకులో మాత్రమే 70 సంఘాలకు రుణాలు మంజూరు చేయడం తిరిగి సక్రమంగా రీపేమెంట్ చేయడం జరిగిందని, రెండవసారి లింకేజీ రుణానికి రెడీగా ఉన్నారని, అదే విధంగా అన్ని గ్రామీణ బ్యాంకుల్లో కూడా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించాలన్నారు. బ్యాంకర్లు నిర్దేశించిన నియమ నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు అందేలా చూడాలని, ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష భీమా యోజన పథకాల ఇన్సూరెన్స్ క్లైయిమ్‌లు లబ్దిదారులకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీడ్ బ్యాంకు మేనేజర్ ఉమా శంకర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్, స్టేట్‌బ్యాంక్ మేనేజర్ కిరణ్, ఎపిఎంలు పైడి కూర్మారావు, రవిరాజా, కమల కుమారి పాండ్యన్, రవికుమార్, సిఎఫ్ఎల్‌లు వెంకటేష్, రామారావు తదతరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సాంకేతిక విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని వాటికోసం క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకో గలుగుతారని ప్రజా ఆరోగ్య విభాగం ఇఇ పి.సుగుణాకరరావు అన్నారు. చిలకపాలెం సమీపంలో ఉన్న శివాని ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంజనీరింగ్ విద్యపై ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కోచింగ్‌లో ఏ విధంగా చదువుకొని ఉద్యోగ, ఉపాధి నైపుణ్యతను పెంపొందించుకోవాలనే అంశాలను వివరించారు. బిఎస్ఎన్ఎల్ మాజీ జిఎం డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ తల్లితండ్రులు తమ

మాట్లాడుతున్న సుగుణాకరరావు

పిల్లలపై ఎన్నో ఆశలు పెట్టుకుంటూ వారి కలలు సాకారం అయ్యే రోజు కోసం ఎదురు చూస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సభ్యులు పి.దుర్గాప్రసాద్ రాజ్, డి.వెంకటరావు, ఎస్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.వెంకటేశ్వర్, టిడిబాలాజీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన చేయాలి

టెక్కలి : తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే ఉపాధ్యాయులు తన బోధనలో మెలకువలు ఉండాలని డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వారోత్సవాల్లో భాగంగా చేపట్టే కార్యక్రమాలను ఉపాధ్యాయులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదిలో ప్రదర్శించే టిఎల్ఎంను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నందికేశ్వరరావు, ఎంపిపి ప్రతినిది ఆట్ల రాహుల్‌కుమార్, తోట లోకేష్, పినిమింటి ఎర్రయ్య, దేవాది అప్పారావు, సత్యం, రాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: బోధనా సామగ్రి పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడానికి దోహదపడతాయని ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. కోటబొమ్మాళి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్.ఆనందరావు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, యర్నాగుల వాసుదేవరావు, మంచాల సీతారాం పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆదర్శ పాఠశాలలో ఘనంగా శిక్షా సప్తాహ్ సోమవారం జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక వనరులతో బోధన, తయారీపై ప్రదర్శన జరిపారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలం ఇప్పించాలని వినతి

పలాస: మోళియపుట్టి మండలం చీపురుపల్లికి చెందిన నందిగాం తాతారావు తన స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, తన స్థలం తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో, బంధువులతో కలిసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరులో తన భూములు కోల్పోయానని అన్నారు. ఆ భూములకు సంబంధించి నష్టపరిహారానికి నానా అవస్థలు పడి వచ్చిన నష్టపరిహారంతో నర్సిపురం సర్వే నంబరు 149/10లో 2500 చదరపు గజాలు అప్పట్లో రూ.10 లక్షలకు స్థలాన్ని కొనుగోలు చేశానని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 15న చిన్నబడాంకు చెందిన కె.రామకృష్ణ, కె.ప్రసాద్,

నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబసభ్యులు

కె.గోవింద్, మరో మహిళ తన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు వారికి చూపించినా దౌర్జన్యానికి పాల్పడుతున్నరని వాపోయారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు, డిఎస్‌పి నాగేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో బాధితుల గోడు విని న్యాయం చేయాలని ఆర్‌డిఒ, డిఎస్‌పిలు సిఐ విజయానంద్‌కు ఆదేశించారు.

కళాసీల ఆందోళన

ఆందోళన చేస్తున్న కళాసీలు

కొత్తూరు: మండలంలోని వసప ఎఫ్‌సిఐ గొడౌన్‌లో 54 మంది కళాసీలు ఏడేళ్లుగా పనిచేస్తున్నారని మేస్త్రి వలరౌతు సురేష్ తెలిపారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు లెటర్‌ను కొంతమంది స్థానికులు తీసుకొచ్చి ఎఫ్‌సిఐ మేనేజర్ శ్రీదేవికి సోమవారం ఇచ్చి విధుల్లో చేరి లారీ లోడ్ చేశారని అన్నారు. దీంతో గేటుకు తాళం వేసి లారీని బయటకు వెళ్లనీయకుండా సోమవారం అడ్డుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మమ్మల్ని తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ క్రీడలో మాపొట్ట కొట్టడం సరైన పద్ధతి కాదన్నారు. గొడౌన్‌లో వంద మంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై మేనేజర్‌ను వివరణ కోరగా ఎమ్మెల్యే లెటర్ ఇవ్వడం వాస్తమేనని, దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ ఢిల్లీలో ఉన్నారన్నారు. ఆగస్టు 1 వరకు వేచిఉండి కలిసి పని చేయాలని సూచించామని తెలిపారు.

క్రైమ్ కార్నర్

ఐటిఐ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

సాయికుమార్ (ఫైల్)

మండలం పొన్నాడ పంచాయతీ పంచిరెడ్డి పేటకు చెందిన చదువుల సాయికుమార్ (17) తల్లిదండ్రులు మంద లించారన్న కారణంగా ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన తరువాత సాయికుమార్ శ్రీకాకుళం నగరంలో ఒక ప్రైవేటు ఐటిఐలో చేరాడు. అయినప్పటికీ క్లాసులకు సక్రమంగా వెళ్లక, సరిగా చదవకపోవడంతో తల్లి దండ్రులు మందలించారు. దీంతో సాయికుమార్ ముద్దాడ పేటలోని తన అమ్మమ్మ వారికి ఇంటికి వచ్చి ఈ నెల 12న ఫ్యాన్‌కు తాడు బిగించి ఉరివేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుని తల్లి కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతుడి తల ఛిద్రం కావడంతో గుర్తుపట్టలేని విధంగా ఉందన్నారు. మృతుడి ఎడమ చేతి పైన అమ్మానాన్న అని రాసి ఉందని, నీలం రంగు షర్టు, ముదురు నీలం రంగు ప్యాంటు ధరించినట్లు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వాళ్లు ఈ కింది ఫోన్ నెంబర్ 9493474582 సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

పుణెలో కవిటివాసి మృతి

ప్రజాశక్తి- కవిటి

కృష్ణారావు (ఫైల్)

మండలం రాపాకపుట్టుకకు చెందిన మామిడి కృష్ణారావు(45) పూణేలో ఆదివారం రాత్రి మృతి చెందారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు పుణెలో ఒక పేపర్ మిల్లులో పనిచేస్తున్న కృష్ణారావు రెండు రోజుల క్రితం పూణేలో తాను నివాసం ఉంటున్న ఇంటి వద్ద బిపి వచ్చి పడిపోయారు. దీంతో పక్కనేఉన్న తోటి కార్మికులు కృష్ణారావును అందుబాటులో ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న కృష్ణారావు ఆదివారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.

అనారోగ్యంతో విలేకరి మృతి

రమేష్ (ఫైల్)

కోటబొమ్మాళి: సీనియర్ విలేకరి పట్నాయకుని రమేష్ (60) ఆదివారం రాత్రి మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రాగోల్ జెమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడులు ఉన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లోని కళింగజ్యోతి, విశాఖసమాచారంతో పాటు పలు దినపత్రికల్లో విలేకరిగా పనిచేశారు. రమేష్ మృతిపై కోటబొమ్మాళి ప్రెస్‌క్లబ్ సంతాపం వ్యక్తం చేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి రూరల్ : పశుసంవర్ధకశాఖ, ఎన్ఆర్‌జిఎస్ సంయుక్తంగా గోకులం షెడ్స్ నిర్మాణాలు చేపడుతుందని, లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని పశువైద్యాధికారి మెట్ట పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. పశు సంవర్ధకశాఖ గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అన్నారు. అర్హులైన వారు పూర్తి వివరాలతో పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో కలవాలని తెలిపారు.

'108' పరిశీలన

పాతపట్నం : వర్షాకాలం సందర్భంగా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని 108 ఆడిట్ చేసిన డివిజనల్ అధికారి జి.జగన్ సూచించారు. ఈ మేరకు సోమవారం 108ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిడుగుపాటు, పాముకాట్లు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని అన్నారు. ఫోన్ కాల్ వచ్చిన తక్షణమే రోగి వద్దకు చేరుకోవాలన్నారు. వాహనంలో పరికరాలు, మందులు రోజూ సరిచూసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలట్ సిహెచ్.చిన్న ఉన్నారు.

ఎరువులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎరువుల పంపిణీ

నౌపడ: సంతబొమ్మాళి మండలం హనుమంత నాయుడుపేట రైతు సేవా కేంద్రం వద్ద సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్, టిడిపి నాయకులు రైతులకు సోమవారం ఎరువులను పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు అనిల్‌ప్రభాస్, కేశవ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇఎపి సెట్ 2024 తుదివిడత ఆన్‌లైన్ కౌన్సిలింగ్ షెడ్యూల్ ఉన్నత విద్యామండలి విడుదల చేసిందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన ఆచార్యులు జి.దామోదరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 నుంచి 24 వరకు వెబ్‌సైట్‌లో కౌన్సిలింగ్ ఫీజ్ చెల్లించి రిజిస్ట్రేషన్ అనంతరం ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాలు పరిశీలన జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈనెల 24 నుంచి 26 వరకు కళాశాలలు, బ్రాంచిలు ఎంపికకు చేసుకోవాలన్నారు. మొదట విడతకు కౌన్సెలింగ్ హాజరైన మెరుగైన కళాశాల కోరుకునే విద్యార్థులు కూడా నిర్దేశించిన తేదీల్లో వెబ్‌ఆప్షన్ ఎంచుకోవాలన్నారు. కళాశాల కేటాయింపు వివరాలు ఈనెల 30న ప్రకటించడం జరుగుతుందన్నారు. 31 నుంచి ఒకటవ తేదీ వరకు సీటు పొందిన కళాశాలలో వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.